క్లుప్తంగా

తల్లిదండ్రులను మించిన దైవం లేదు



నిజాంసాగర్(జుక్కల్) : తల్లిదండ్రులను మించిన దైవం మరొక్కటి లేదని, వారి సేవ చేసిన వారికి పుణ్యం లభిస్తుందని రంగంపేట పీఠాధిపతి మాదవానంద సరస్వతి స్వామిజీ పేర్కొన్నారు. సోమవారం మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామంలో ముప్పిడి మురళి కుటుంబ సభ్యులు స్వామిజీకి పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ప్రతిఒక్కరు అధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు దైవ కార్యక్రమాల్లో తమ వంతు బాధ్యతగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతుకు సన్మానం



బాన్సువాడ : లయన్స్ క్లబ్ ఆఫ్ బీర్కూర్ ఆధ్వర్యంలో సోమవారం ఉత్తర రైతు ఏనుగుపట్ల భోజ్జిని ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఉత్తమ రైతులను ఎంపిక చేసి సన్మానిస్తారు. అందులో భాగంగా బీర్కూర్‌కు చెందిన రైతు భోజ్జిని ఉత్తమ రైతుగా ఎంపిక చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు గాలయ్య, గంగారం, సంతోష్‌గుప్తా, రమేశ్, విఠల్, మేకల శ్రీనివాస్, రాజేందర్, బాబులాల్, యాదరావు ఉన్నారు.

ఎన్‌సీసీ అధికారికి..



భిక్కనూరు : మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ అధికారిగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అనిల్‌కుమార్ ఎన్‌సీసీ ప్రథమ శ్రేణి అధికారిగా పదోన్నతి పొందాడు. ఈ విషయమై ఆయనను 2007–2008 పదోతరగతి పూర్వ విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మేజీషియన్ సంతోషకుమార్, శ్రీనివాస్, నర్సింలు, గోపి, రమేష్‌లు పాల్గొన్నారు.

అగ్నిపథ్ వీరుడికి..



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని అంజని గ్రామానికి చెందిన జీవన్ సింగ్ యువకుడు అగ్నిపత్ శిక్షణ పూర్తి చేసుకొని సోమవారం తన స్వగృహానికి రావడంతో గ్రామస్తులు జై జవాన్ నినాదాలు చేస్తూ స్వాగత కార్యక్రమం నిర్వహించారు. జీవన్ సింగ్‌కు గ్రామస్తులు అభినందించారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



బాన్సువాడ రూరల్ : గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం తనను మర్యాద పూర్వకంగా కలిసిన జైగౌడ సంఘం జిల్లా నాయకులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భం జైగౌడ సంఘం ప్రతినిధులు రవీందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మురళీగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బాలకిషన్, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు



దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ కంటి వైద్యులు లింబాద్రి దోమకొండతో పాటు పలు గ్రామాలకు చెందిన వారికి ఉచితంగా పరీక్షలు చేసి వారికి మందులను అందజేశారు. ప్రతి సోమవారం ప్రభు త్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉంటున్నట్లు ఆయన వివరించారు.వైద్య సిబ్బంది మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

నేడు ఎల్లారెడ్డికి ఎమ్మెల్యే రాక

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మంగళవారం ఎల్లారెడ్డికి రానున్నట్లు కాంగ్రెస్ నాయకులు సోమవారం తెలిపారు. పట్టణంలోని పెద్ద చెరువు కట్ట వద్ద జరుగుతున్న పనులను పరిశీలించేందుకు ఎమ్మెల్యే వస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం అధికారులతో సమీక్ష, పలు అభివృద్ధి పనుల పరిశీలన చేయనున్నట్లు వారు తెలిపారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి




ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు క్యాంప్ ఆఫీస్‌లో వైఎస్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, దోమకొండలో..

దివంగత సీఎం వైఎస్సార్ జయంతిని జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. వైఎస్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



సుభాష్‌రెడ్డి నివాసంలో..



బాన్సువాడలో..



పిట్లంలో..



భిక్కనూరులో..



మాచారెడ్డిలో..

మండలాల్లో ప్రజావాణి




తాడ్వాయి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు, రాజంపేటలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రహీమొద్దీన్ మాట్లాడుతూ ప్రజావాణిలో వివిధ రకాల ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వాటిని పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, ఏవో శ్రీకాంత్, ఏపీఎం రవీందర్, ఎంపీవో హెప్సీభారాణి, ఏపీవో మల్లేశ్ పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట మండలం తహసీల్దార్ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి లో 3 ఫిర్యాదు లు అందినట్లు తహసీల్దార్ అనిలకుమార్ తెలిపారు. విచారణ కొరకు సంబంధిత అధికారులకు అందచేసినట్లు ఆయన తెలిపారు.

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు రాలేవని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం..

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో 2004–05 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి మిత్రులు ఆనాటి తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. – భిక్కనూరు



పెరుగుతున్న వానరాల బెడద

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద కొంతకాలంగా వానరాల బెడద నెలకొంది. కార్యాలయాల ఆవరణలో చెట్లు దట్టంగా పెరగడంతో ఎక్కువ సంఖ్యలో వానరాలు చెట్లపై నుండి దూకుతూ కార్యాలయాలకు వచ్చే ప్రజలను, అధికారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కార్యాలయాలకు వచ్చే ప్రజలపై దాడులకు పాల్పడుతూ వారిని భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల వద్ద వానరాల బెడదను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో కోతులు

ప్రిన్సిపాల్‌ను తొలగించాలి

నిజాంసాగర్(జుక్కల్) : అచ్చంపేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయాన్ని ముట్టడించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఈవో కార్యాయం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఆదర్శ పాఠశాలలో నిధులు అక్రమాలకు పాల్పడిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి వసతి, క్రీడాప్రాంగణం, ల్యాబ్, తరగతి గదుల్లో ఫ్యాన్ల కొరత తీర్చాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్, డివిజన్ కమిటీ మెంబర్ పిర్దోస్, కమిటీ సభ్యులు జమీల్, సందీప్, కిషన్ ఉన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వీడీసీపై తప్పుడు ఫిర్యాదులు

భిక్కనూరు : గ్రామాభివృద్ధి కమిటీకి బకాయి ఉన్న డబ్బులను చెల్లించాలని అడిగితే బకాయిదారులు వీడీసీపై తప్పుడు ఫిర్యాదుల చేస్తున్నారని మండలంలోని జంగంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శివలింగం ఆధ్వర్యంలో వీడీసి ప్రతినిధులు శనివారం భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాలను అందజేశారు. బకాయి దారులు వీడీసీకి చెల్లించాల్సిన డబ్బులను చెల్లించకుండా ఉండేందుకే వారు తప్పుడు పిర్యాదులు చేస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో వీడీసీ ప్రతినిదులు జనార్దన్‌రెడ్డి, రాములు, బాల్‌కిషన్‌లు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వీడీసీ ప్రతినిధులు

నూతన కార్యవర్గం



భిక్కనూరు : మండలంలోని అంతంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గంను సోమవారం గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వలకొండ అమృతరెడ్డి ఉపాధ్యక్షుడిగా పిట్ల రాములు, కోశాధికారిగా బస్వా రవీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అలాగే కుల సంఘాల వారీగా డైరెక్టర్లను ఎన్నుకున్నారు. నూతన వీడీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన అమృత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్దే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టిసారించాలి



నిజాంసాగర్(జుక్కల్) : ఇంటింటా ఐదు మొక్కలు నాటి వాటి సంరక్షణపై దృష్టి సారించాలని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. సోమవారం జుక్కల్ మండల కేంద్రంలోని వన నర్సరీని ఆయన పరిశీలించారు. సదరు నర్సరీలో పెంచిన హోంసీడ్ మొక్కలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. జీపీ కార్యదర్శి బలరాం తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో ఎట్టి పరిస్థితుల్లో మూఢ నమ్మకాలను నమ్మవద్దని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజు సూచించారు. సోమవారం మండలంలోని తుక్కోజివాడి ఉన్నత పాఠశాలలో పోలీస్ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు, షీటీమ్ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెయిన్స్‌కు ఎంపికైన పిట్లంవాసులు





అనిల్‌గౌడ్ | కిషోర్ | భీంరావు

పిట్లం(జుక్కల్) : గ్రూప్–1 ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. గ్రూప్ 1 మెయిన్స్‌కు పిట్లం మండలంలోని తిమ్మానగర్ గ్రామానికి చెందిన అనిల్ గౌడ్ అర్హత సాధించారు. అనిల్ గౌడ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసుకొని మొదట బ్యాంక్‌లో క్యాషియర్‌గా ఉద్యోగం సాధించాడు. అనంతరం సివిల్స్ ఎస్సై ఉద్యోగానికి ఎంపికై ఎస్సైగా విధులు నిర్వహిస్తూ గ్రూప్–2 ఉద్యోగం సాధించి ప్రస్తుతం ఏసీటీవోగా విధులు నిర్వహిస్తూ గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హత సాధించాడు. తిమ్మానగర్ గ్రామానికి చెందిన కిషోర్ ప్రస్తుతం హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా విధులు నిర్వహిస్తూ గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హత సాధించాడు. అదేవిధంగా మండలంలోని కంభాపూర్ గ్రామానికి చెందిన భీంరావు ప్రస్తుతం మండలంలోని మార్దండలో జీపీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హత సాధించాడు. గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హత సాధించిన వీరికి అధికారులు, గ్రామస్తులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బదిలీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపడుతున్న భానుమతి బదిలీ అయ్యారు. మెదక్ జిల్లా శంకరంపేట్ మోడల్ స్కూల్‌కు డిప్యూటేషన్‌పై బదిలీ చేసినట్లు తెలిసింది. ప్రిన్సిపాల్‌తో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులను కూడా డిప్యూటేషన్‌పై బదిలీ చేసినట్లు సమాచారం.

గోపాల్‌పేటలో తైబజార్ వేలం



వేలంపాట నిర్వహిస్తున్న జీపీ సిబ్బంది

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలకేంద్రం గోపాల్‌పేట జీపీ కార్యాలయంలో సోమవారం తైబజార్ వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా వేలంపాటలో వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు పాల్గొనగా వారిలో ధరావత్ రాము అనే వ్యక్తి రూ.3.14లక్షలకు వేలంపాడి తైబజార్‌ను దక్కించుకున్నారు. ఈ ఏడు జూలై 8వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వరకు తైబజార్ వసూలు చేసుకోవచ్చని జీపీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు.

కామారెడ్డి బల్దియాలో..

కామారెడ్డి టౌన్ : మున్సిపల్ పరిధిలోని తైజార్‌కు సోమవారం మున్సిపల్ ఆఫీస్‌లో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ బహిరంగ వేలంలో ముగ్గురు సభ్యులు పాల్గొనగా చాట్ల శ్రీనివాస్ రూ.19.10లక్షలకు తైబజార్‌ను ద క్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సుజాత్ ఉన్నారు.

‘తల్లిదండ్రుల పేరిట మొక్కలు నాటాలి’




మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, కొయ్యగుట్ట తండాలో..

కామారెడ్డి అర్బన్: ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ తల్లిదండ్రుల పేరిట మొక్కను నాటి సంరక్షించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. సోమవారం యోగా భవన్ ఆవరణలో యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి మొక్కలు నాటారు. యోగా భవన్ ఆవరణలో వివిధ ఔషధ విలువలున్న మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినందుకు ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ ప్రతినిధులు బాస రఘుకుమార్, కే.సిద్ధాగౌడ్, 42వ వార్డు కౌన్సిలర్ పండ్ల ప్రవీణ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కొయ్యగుట్ట జీపీలో..

బాన్సువాడ రూరల్ : మండలంలోని కొయ్యగుట్ట జీపీ పరిధిలోని ఇంటింటికి జీపీ కార్యదర్శి రాహేలా బేగం ఆధ్వర్యంలో సోమవారం హరితహారం మొక్కలను పంపిణీ చేశారు. పంపిణీ చేసిన మొక్కలను ఇంటి పరిసరాల్లో నాటాలన్నారు. హరిత హారం కార్యక్రమం విజయవంతానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. జీపీ క్షేత్రసహాయకుడు అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం ప్రత్యేక పూజలు



బేగంపూర్ హనుమాన్ ఆలయంలో జలాభిషేకం



పాప హరేశ్వర ఆలయం వద్ద అన్నదానం

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : వర్షాలు సమృద్ధిగా కురువాలని వేడుకుంటూ మండలంలోని బేగంపూర్ గ్రామస్తులు సోమవారం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయల గర్భగుడిలో హనుమాంతుడి మూర్తి పూర్తిగా మునిగే వరకు నీళ్లు పోశారు. పాప హరేశ్వర ఆలయం నుంచి భజనలతో 11 గ్రామల హనుమాన్ ఆలయలను దర్శించుకొనిపూజలు చేశారు. అన్నదానం చేశారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో జలాభిషేకాలు నిర్వహించారు. ఐదు బోరు బావుల నుంచి నీటిని బిందెలతో తీసుకొచ్చి గర్భ గుడిని నింపారు. వేదబ్రాహ్మణుడు సంతోష్‌కృష్ణ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ జోగిన రాజయ్య, మాజీ చైర్మన్ కొప్పుల నర్సారెడ్డి, డైరెక్టర్లు, సనాతన భజన మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని భవానీపేటలో సోమవారం గ్రామస్తులు వర్షాల కోసం శివాలయాల్లో నీళ్లు నింపారు. తడి బట్టలతో బిందెలలో నీళ్లు తీసుకొని శివాలయాలోల్ నీళ్లు నింపి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కిషన్, సురేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఫరీద్‌పేటలో..

మాచారెడ్డి : పాల్వంచ మండలం ఫరీదుపేటలో సోమవారం గ్రామస్తులు వీర హనుమాన్ ఆలయంలో వరుణయాగం నిర్వహించారు. అనంతరం వరుణున్ని వేడుకుంటూ పాట పాడుతూ భజన చేశారు.



మాచారెడ్డిలో..



సదాశివనగర్‌లోని కాశీ విశ్వేశ్వరాలయంలో..



భవానీపేటలో..

‘చర్యలు తీసుకోండి’

దోమకొండ : మండల కేంద్రంలోని ఊరడమ్మ కాలనీకి చెందిన పలువురు కాలనీవాసులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణికి పెద్దఎత్తున తరలివచ్చారు. తహసీల్దార్ సంజయ్‌రావ్‌కు ఫిర్యాదు చేశారు. తమ కాలనీకి చెందిన చింతల సుమన్, చింతల శ్రావన్, సువర్ణలపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. సదరు వ్యక్తులు కాలనీవాసులను ప్రతిరోజు తిడుడూ ఆయుధాలతో బెదిరిస్తూ భయపెడుతున్నారన్నారు. వీరిపై గతంలో పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినట్లు వివరించారు. వీటికి సంబంధించి సీసీకెమెరా రికార్డులు ఉన్నాయన్నారు. కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలోని తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న మహిళలు

సమాచారం

సిద్దేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని బ్రహ్మాజీవాడి గ్రామ శివారులోని సిద్దేశ్వర ఆలయంలో సోమవారం గ్రామ పెద్దలు, యువకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగాన్ని పాలాభిషేకం, జలాభిషేకం చేశారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి ఈ ఖరీఫ్‌లో వేసిన పంటలు బాగాపండాలని ఆ సిద్దేశ్వరుడిని వేడుకున్నారు.

పంచముఖ శివలింగానికి ప్రత్యేక పూజలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని నెమ్లి గ్రామంలో ఉన్న పంచముఖ శివ లింగాలయంలో సోమవారం లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచ ముఖ లింగం ఉన్న ఆలయంలో దేశంలోనే లేదని ప్రతివారం రుద్రాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో వన మహోత్సవం



లింగంపేట(ఎల్లారెడ్డి):మండలంలోని వివిధ గ్రామ పంచాయితీల్లో సోమవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వన మహోత్సవం కార్యక్రమంలో బాగంగా 41 గ్రామ పంచాయితీల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలని గ్రామ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో ఉపాధి హామి కూలీలచే మొక్కలు నాటించాలన్నారు. నాటిన మొక్కల సంరక్షణ చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో పొలం గట్లపై, పాఠశాలలు, ఇంటి పరిసరాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. ఆయన వెంట కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.